
# ఆదర్శాల అంచున

తెనాలి సుశీలాదేవి



వంశవృక్షం చూసి బయలుదేరాం యింటికి.

నా మనసంతా ఆవేదన ఆవరించుకు పోయి మబ్బుకమ్మిన ఆకాశంలా వుంది. యిద్దరం మౌనంగానే నడుస్తున్నాం.

మా యిద్దరి మధ్య అలవాటులేని మూగతనం ఎంతోసేపు భరించలేక పోయాను.

"సినిమా చాలా బావుంది కదూ" అడిగాను.

"నాకు నచ్చలేదు" పొడిగా వుంది మౌళి జవాబు.

ఒక సినిమా చూస్తే తెరమీది నటులనే గాక తెరవెనుక వుండే సాంకేతిక నిపుణులందరిలో ఎవరు కృతకృత్యు లయ్యారో, ఎవరు అసమర్థులయ్యారో అదొక చర్చనీయాంశంగా ఓ అరగంట విమర్శిస్తూ వుపన్యాసం యిచ్చే మౌళేనా అనిపించింది నాకో క్షణం.

"అంత బాగుంటే ఎందుకు నచ్చ నట్లో..." కుతూహలం నన్నడిగించింది.

"అసలు కథే బాగా లేదు"

విషయం తెలిసిపోయింది నాకు దాంతో కొద్దిగా కోపం కూడా వచ్చింది

"అవును మీ కెందుకు బావుంటుంది. మీరూ మగవాళ్ళే కదా. విధవగా మారిన ఆడపిల్ల పునర్వివాహం చేసుకోడమే మీకు నచ్చని కారణం. అలాగే ఏడ్చు కుంటూ గతస్మృతుల అగ్నికీలలలో మాడిపోతూ మడి గట్టుకుని తద్దినాలు పెట్టుకుంటూ"

"ఆ ఆ యీ వుపన్యాసం వినే ఓపిక నాకు లేదు. నీ అమూల్యాభి ప్రాయాలన్నీ నీ రచనల్లో క్రుమ్మరించు. నీ అభిమాన పాఠకులు జేజేలు పలుకు తారు" ఆ మాటల్లో వ్యంగ్యం సూటిగా నా హృదయాన్ని తాకింది.

ఆదర్శాలు, అభిప్రాయాలు రచనలు

చేసుకోగలిగినవే గానీ ప్రదర్శించటానికి, ఆచరించటానికి పనికిరావా

అదే అడిగాను మౌళిని.

నవ్వాడు మౌళి. ఆ నవ్వు అ నవ్వు

ఎంతో బాగా తెలిసిన మేధావి, ఏమి తెలీసీ దద్దమ్మను చూసి నవ్వినట్టు చురుక్కున గుచ్చినట్టయింది నాకు.

"అయితే అయితే సినిమాలో హీరోయిన్ మళ్ళీ పెళ్ళిచేసుకోడమే మీకు నచ్చని అంశం. అవునా " రెట్టించినట్టు అడిగాను.

"నీకు నచ్చడం అందువల్లనే కదా" విసురుగా వచ్చింది జవాబు.

"అవును. యిలాంటి సినిమాలు రావాలి రచనలు రావాలి. మూఢాచారాల కటికచీకటిలో మగ్గిపోయే

నా మాటలకు బ్రేక్ వేశాడు మౌళి.

"సినిమాలు, రచనలు మాత్రమేనా ఆచరణలు కూడానా " మళ్ళీ అదే వ్యంగ్యం.

మార్పు రావాలని కోరుకోవడమేకాదు, అలా కోరే ప్రతి ఒక్కరూ తమ పరిధిలో తమకు అవకాశమున్నంత వరకు, తమ చేతఅయినంత వరకూ అందుకు ప్రయత్నం చేయాలి సాధ్యమయినంత వరకు పోరాడాలి "

"అయితే ముందు మీ అక్కయ్యకి పెళ్ళి చేసెయ్."

విద్యుద్ఘాతం తగిలినదానిలా నా ఒళ్ళంతా ఒక్కసారి జివ్వుమంది. మరుక్షణం నా మాటా మనసూ.... రెండూ మూగపోయాయి.

* * *

డాబామీద వెన్నెల్లో పడుకున్నాం.

మౌళి ఎప్పుడో నిద్రపోయాడు. మాకు కాస్త దూరంలో అక్కయ్య మూడేళ్ళ కూతుర్ని పక్కనేసుకుని ఒంటినిండా కొంగు కప్పుకుని అటుతిరిగి పడుకొని వుంది. ఎంత ప్రయత్నించినా కునుకు రావటంలేదు.

ఆకాశంలో చందమామ మబ్బులను తప్పుకుంటూ, ఒక్కొక్కప్పుడు దొరికిపోతూ బయట పడినపుడు మరింత కాంతిని పుంజుకుంటూ, కదిలిపోతున్నాడు.

అక్కయ్య కదిలింది. ఇటు తిరిగి పడుకుంది ఒళ్ళంతా ముడుచుకుని.

చందమామ మీదనుంచి దృష్టి మరల్చి అక్కయ్యకేసి చూశాను.

చందమామ లాంటి అక్కయ్యని మబ్బులా మింగేసింది విధి. దాని కళంతా తనతో తీసేసుకుని ఒట్టి విగ్రహాన్ని మిగిల్చింది.

తనను చూస్తూంటే కడుపులో దేవినట్టుగా వుంటుంది నాకు.

అక్కయ్య నుదుటిమీద కనీకనిపించనట్టుగా వున్న ఎర్రని తిలకంబొట్టు తడిసి

శారి.... ముక్కుమీదకు వచ్చి...

ఆ చిన్నబొట్టు.... పీక్కుపోయిన ఆ ముఖానికి కూడా ఎంత అందం తెస్తోంది. తనను యీ మాత్రం వుంచ డానికి కూడా నేను హోరాహోరీ పోట్లా డాల్సి వచ్చింది.

ఆ మబ్బు మసక వెన్నెలలా నా తలతో జ్ఞాపకాల తెరలు.

* * *

హడావిడిగా వచ్చాడు మౌళి....

కథేదో వ్రాసుకుంటున్నాను నేను.

"ఆ కాగితాలు ఎత్తిపెట్టి త్వరగా బయల్దేరు...." అన్నారు.

ఆశ్చర్యంగా చప్పున తలెత్తి చూశాను.

రెండు చేతుల వ్రేళ్ళు ఒకదానిలో ఒకటి జొనిపి .... ఆ అరచేతుల్లో ముఖం దాచుకుని ....

మౌళిని అలా చూడగానే నా గుండె గుబగుబలాడింది. వెనువెంట రాగానే అతను పలికిన ఆ ఒక్కమాట ....

నా వెన్నెముకగుండా తెలీని భయం జరజర పాకింది.

దగ్గరకు వెళ్ళి భుజంమీద చేయి వేశాను.

చప్పున నా నడుంచుట్టూ చేతులేసి.... నా గుండెల్లో ముఖం దాచుకుని... ఏడుస్తున్నాడు.... మౌళి ఏడుస్తున్నాడు.

భయం .... ఆశ్చర్యం .... ఏదో తత్తరపాటు.

"ఏమిటి ? ఏ మ యిం ది...." నా స్వరంలో వణుకు.

ఆ వెక్కిళ్ళ మధ్య వచ్చిన జవాబు నన్ను నిర్విణ్ణురాల్ని చేసింది.

"అన్నయ్య పోయాడు శారదా ...." వాక్యం పూర్తిచేయకనే దుఃఖపు తెర ఉధృతంగా కమ్మేసింది

"అన్నయ్య...." ఏ అన్నయ్య.... అడగలేకపోయాను. కాని .... కాని నా కళ్ళముందు మా నలుగురి బావగార్లూ గిర్రున తిరిగారు. వారిలో ... ఎవరు.... ఎవరు... ఎవరూ పోయేస్థితిలో లేరే....

నా గుండె బిగబట్టుకున్నాను. మౌళి తలమీద నా చేతులు అసంకల్పితంగా నిమురుతున్నాయి. ఓదారుస్తున్నట్టుగా కదులుతున్నాయి.

చివ్వున ముఖం ఎత్తి నా ముఖం లోకి చూశాడు మౌళి.

ఆ కళ్ళు మండేనిప్పుల్లా వున్నాయి. ఆ ముఖం వడిలిన కమలంలా వుంది,

"శంకరమన్నయ్య మనకిక లేడు శారదా ...."

నా గుండె క్షణంసేపు ఆగినట్టయి.... ఆ తరువాత వేగంగా కొట్టుకో నారంభించింది. నరాల్లో రక్తప్రసారం తీవ్రమయినట్టయి .... తల తిరిగినట్టు .... కళ్ళముందు చీకటితెరలు ముసురుకుంటున్నట్టు... చప్పున [illegible]పోయాను

ఓ గంట తరువాత స్పృహలోకి

వచ్చాక, నేనున్న స్థితి తెలిశాక, ఆ స్థితిలోకి నేనెందుకొచ్చానో స్ఫురించిన క్షణాన నీళ్ళు నిండిన నా మసక కళ్ళకు కనిపించింది మౌళి కాదు. పోయా రంటున్న మా బావగారిరూపమూ కాదు.

లక్ష్మీదేవిలా కలకలలాడుతూ, కిలకిల నవ్వుతూ కదలితరంగంలా త్రుళ్ళిత్రుళ్ళి పడే సీతక్కయ్య

ఇప్పుడెలా వుందో

అటువంటి స్థితి కలిగిన ఒకరిద్దరిని చూసిన రూపంలో సీతక్కయ్యని వూహించుకోబోయాను. నాకు సాధ్యం కాలేదు.

విధి విసిరిన యీ ఆఘాతాన్ని ఎలా తట్టుకుంటుంది అసలా తనే స్థితిలో వుందో కర్తవ్యం స్ఫురించి ప్రశ్నార్థకంగా చూశాను నాకేసే కంగా రుగా చూస్తున్న మౌళివైపు.

"మనం వెళ్ళాలి. నీ వేమిటి అందరికి ధైర్యం చెప్పాల్సినదానివి యిలా అయి పోయావు ... లేదు. ఓపిక తెచ్చుకుని బయల్దేర ..

దుఃఖాన్ని దిగమింగినట్లు కనిపించినా దాని తాలూకు జీర కంఠాన్ని వదలలేదు ఈ స్థితిని ఎదుర్కోవడం ఎలా

ఈ ఆలోచనే మా యిద్దర్నీ తినేస్తోం దని నాకు తెలుసు.

రైల్లో ఒకరితో ఒకరం మాట్లాడుకో లేకపోయాం ఎవరి కళ్ళలోకి ఎవరు చూస్తే నదులు పొంగేట్లు

* * *

ఒక వ్యక్తి నిష్క్రమణ అతనెంత ఆత్మీయుడయినా, సన్నిహితుడయినా తన భాగస్వామిని యింతగా క్రుంగ దీస్తుందా ఆశ్చర్యం కలిగింది నాకు సీతక్కయ్యను చూడగానే.

అసలా జీవిలో వూపిరి వుందో లేదో కూడా తెలియనంతగా ఏళ్ళ తరబడి మంచంలో తీసుకుంటున్నదానిలాగ ఆ కళంతా చేయిపెట్టి తుడిచేసినట్టుగా ఎక్కడికి పోయింది?

వెన్నెల విరిసినట్లుండే చిరునవ్వును యిన్నాళ్ళూ ఆ పెదాలమీదేనా చూశాము? దుఃఖాన్ని కంఠంలో అదిమి పెట్టి ఏమాత్రం సందు దొరికినా ప్రవాహవేగంతో బయటపడొచ్చునన్న భయంతో పెదిమలను బిగించిపట్టి నిండిన చెరువుల్లాంటి కళ్ళతో సీతక్కయ్య అనబడే స్పృహలేని ఆ జీవిని వాటేసు కున్నాను.


నా గుండెల్లో పొదువుకున్నాను

జలపాతాల్లా దూకే నా కన్నీళ్ళు తన తల తడిపి ఎందరి కన్నీళ్ళు తనని అభిషేకిస్తే మాత్రం ఆ గుండెని కాల్చే స్తున్న చిచ్చు చల్లారుతుందా

నిమిషాలమీద పచ్చదనం హరించుక పోయి మోడయిపోయిన ఆ హృదయం ఎన్ని వుపశమనాలు పలికితే మాత్రం చిగుర్లు తొడుగుతుంది?

స్పృహలోకి వచ్చాక సీతక్కయ్య ఒకక్షణం నాకేసి చూసింది అపరిచితు

నేరకపోయి దీన్నెత్తితే అప్పిస్తానన్నాను.




రాలిలా. మరుక్షణం వరదలో మునిగి కొట్టుకుపోతున్నదానిలా భయభ్రాంతురాలయి.... ఆ మూడో క్షణంలో తనే వెల్లువై నన్ను చుట్టేసింది.

నడుస్తున్న శవాల్లా వున్న మా మధ్య పడుకున్న శవంలా వుండిపోయింది అక్కయ్య. ఈ పనులన్నీ జరపటం ఒక ఎత్తూ, అక్కయ్యను చూచుకోటం ఒక ఎత్తూ అయింది. షాక్‌కి తట్టుకోలేక ఫిట్సు రావటం మొదలవటంతో తనని వదిలి యివతలికి రావటమే కష్టమైపోయింది.

ఇలాంటి స్థితిలోనే తొమ్మిది రోజులూ గడిచిపోయాయి. తెల్లవారితే పదోరోజు.

ఆ రాత్రి యింట్లో ఓ పోరాటం లాంటిదే జరిగింది.

తెలివి వుండీ, లేక చచ్చినదానిలా పడివున్న ఆ స్థితిలో కూడా ఆచారాలన్నీ జరగవలసిందేనా?

మానవత్వం మీద క్షణాలపైన ముసుగేసేసే యీ సాంప్రదాయం యిలా సాగిపోవలసిందేనా?

గుండెలు బాదుకుని ఏడ్చిన యీ ఆత్మీయులంతా రేపు మరో హృదయ విదారక దృశ్యాన్ని సృష్టించేందుకు సర్వ సన్నద్ధమవుతున్నారా?

తలుచుకొనేకొద్దీ ఆ ఆచారాల మీద కోపం, వాటికోసం నడుంకట్టిన యీ ఆత్మీయులమీదకసి పెరిగిపోయాయినాకు.

ఏది ఏమయినా రేపా తతంగం జరగడానికి వీల్లేదు.

ఏదో బాంబు మధ్యలో హఠాత్తుగా వచ్చి పడినట్టు విభ్రాంతులయ్యారు అందరూ.

"శారదా! నీకేమన్నా మతిపోయిందా" మాశీ కోపంగా అరిచాడు.

"మతి పోగొట్టే పనులే వద్దంటు న్నాను" నెమ్మదిగా అన్నాను.

కాని నా మనసులో బిక్కు-బిక్కు-మనే గుబులు తోస్తూనే వుంది.

"నా మాటలు.... నా ఒక్క-దాని మాటలు యింతమంది లెక్క-చేస్తారా అసలు".

"అది ఆచారం శారదా. దుఃఖంతో దుఃఖం కలిసిపోతుంది. దాన్ని మీరటానికి లేదు" నచ్చచెప్పుతున్నట్టుగా అన్నారు మావగారు.

నీళ్ళు నిండిన కళ్ళతో ఆయన వేపు చూశాను.

"మామగారూ...." తరువాత మాట పెగల్లేదు నాకు. కడుపులో రగులుతున్న వేదనాగ్ని కన్నీరు రూపం దాలి కళ్ళ నుంచీ దుముకుతోంది. ఆ భారం కాస్త తగ్గినట్టు అనిపించాక నేను మూగనోము పట్టుకూర్చుంటే జరిగే ఘోరం భరించ లేనని తెలిశాక అతి ప్రయత్నంమీద ధైర్యాన్ని కూడగట్టుకుని కంఠం పెగలాను

"జీవచ్ఛవంలా వున్న ఆ మనిషికి యిప్పట్లో ఆ ఘోరం జరపటానికి మనసెలా వస్తోంది మన తెలివిలో లేకుండా ప్రాపంచికంలోపడి కొట్టు కుంటున్నా సరే ఈ తతంగాలన్నీ జరిగి తీరవలసిందేనా" దుఃఖంలో ఆవేశం చోటుచేసుకుంటోంది.

"తప్పదమ్మా. దుఃఖంలో అలా అంటున్నావు కానీ యిది మూఢాచారం కాదు. సదాచారమే. పెద్దలు మంచి కోసమే చెప్పివుంటారు. వాటిని వుల్లంఘించటం అనాచారం. దాని ఖర్మ అలా వ్రాసివుంది. కట్టుబడక తప్పుతుందా?"

ఆశ్చర్యంగా ఆ మాటలంటున్న ఆవిడకేసి చూశాను. 'తల్లి'. స్వయాన అక్కయ్యను కన్నతల్లి........

ముంచేస్తున్న వుప్పెనలాంటి దుఃఖంలో కూడా ఆచారం మరిచిపోని సదాచారపరురాలు.

ఆచారాలపట్ల వీళ్ళకున్న నిష్ఠకు గౌరవించాలో... కనీసపు మానవత్వాన్ని మరిచిపోయి, ముడుగుపరుచుకొనివున్న రాక్షసత్వాన్ని వెలికితీస్తున్న ఆత్మీయులను అసహ్యించుకోవాలో తెలియలేదు.

"ఏమిటండి యీ ఆచారం అర్థం పర్థం లేకుండా.... ..."

నా మాట ముగియనేలేదు.

"అర్థంపర్థం నీకు తెలియనంత మాత్రాన ఆచారమే అర్థరహితమైపోదు."

అప్పుడు వరకు మౌనంగా వింటున్న పెద్దబావగారు వున్నట్టుండి కోపంగా అలా అనటంతో ఒక్క-క్షణం నిశ్చేష్టురాలినై పోయాను. నాలో సహజంగా వున్న ఆవేశం, ఉద్రేకం, ఆచారాల పేర జరుగుతున్న అన్యాయాలపట్ల నాకున్న నిరసన, వాటి నెదుర్కో-వా

లన్నీ విప్లవభావం నాలో పెల్లుబికింది.

వాటితోపాటు స్త్రీకి సహజబద్ధమైన అర్ద్రత చోటుచేసుకుంది.

"నన్ను మన్నించండి బావగారూ! మీరంతా పెద్దవాళ్ళు. అంతేకాదు. రక్త సంబంధం కలిగిన ఆత్మీయులు. దురదృష్టం తనకు తోడు, నీడ, సర్వస్వం అయిన భర్తను బలితీసుకుంది దానిని ఆపడానికి మనం అశక్తులం. కాని.... కాని.... యీ పూలూ, గాజులు, కుంకుమలు, అలంకారాలు మన చేతులారా దోచి ఆచారమనబడే యీ క్రూర రాక్షసికి బలి యివ్వవలసిందేనా........"

ఆవేశంతోపాటు దుఃఖం తన్నుకు రావటంతో కొన్ని క్షణాలు ఆగాను.

"చూడు వదినా! యిప్పుడు నీవు మాట్లాడావే ఆ మాటలన్నీ జాగ్రత్తగా మరిచిపోకుండా నీ కథల్లో ఎక్కడయినా వ్రాసుకో. పాఠకులను బాగా యింప్రెస్ చేస్తాయి. అంతేగానీ యిక్కడ అప్పగించి........"

ఆ వ్యంగ్యం నన్ను ముల్లులా తగిలింది చివ్వున తలెత్తి కృష్ణకేసి చూశాను.

కాలేజి చదువు ముగించి కొత్తగా వుద్యోగాన్వేషణతో తిరుగుతూ పైలా పచ్చీసుగా గడిపేస్తున్న 'మరిది'గారు కసిగా పళ్ళు నూరుతున్నాను.

"కృష్ణా! వీళ్ళందరూ అంటున్నారంటే అర్థముంది. వాళ్ళలో యింకా ఆచారాలపట్ల గౌరవముంది. గౌరవం కన్నా ఎక్కువ భీతి ఉంది. కాని.... నీవు.... నీవు నవతరానికి చెందిన యువకుడివి. కంకణం కట్టుకుని యిలాంటి మూఢాచారాలను కత్తిపెట్టి నరుక్కొచ్చినట్టు రూపుమాపటానికి ప్రయత్నించాల్సినవాడివి. నీ నోట్లో యీ మాటలు రావటం నాకు అవమానంగా.... అసహ్యంగా...."

"వదినా! నీవు గొప్ప రచయిత్రివి, వుపన్యాసకురాలివి ఐతే కావచ్చుగానీ నీ యిష్టంవచ్చినట్టు మాట్లాడటం బాగాలేదు" బుసలుకొడతున్నట్టు అన్నాడు కృష్ణ.

"శారదా! వూరంతా ఓ దారి వులిపి కట్టెదో దారి అన్నట్టు యిందరి అభిప్రాయాలను నీవు కొట్టిపారేయటం బాగా లేదు. నీకన్నా పెద్దలు, అనుభవజ్ఞులు వున్నారు. ఆ విషయం మరిచిపోకు. యిక్కడ నీవే గొప్పదానివి కాదు..."

నెమ్మదిగా అంటున్నట్టు తోచినా మామ మాటల్లో చురక నాకు బాగా తగిలింది.

'ఇన్నాళ్ళు నా సావాసంలో మెలిగిన మీరు, నన్నూ, నా భావాలను మెచ్చుకుంటూ నాలో వుత్సాహాన్ని పెంచిన మీరు.... చివరకు ... చివరకు .... మీరు కూడా మీదాకా వచ్చేసరికి తేలిపోతున్నారా... ....'

ఆ మాటలు పైకి అనలేనన్న మాటే గానీ, మనసులో మెదుల్తున్న నా భావాన్ని కళ్ళలో ప్రతిఫలించేట్టు ఒక్క చూపు

విసిరి ఒక్క వుదుటున లేచి వెళ్ళి పోయాను దైన్యం గూడుకట్టుకున్న ముఖంతో వెల్లకిలా పడుకుని, జీవంలేనట్లు అనిపించే కళ్ళతో గది పైకప్పుకేసి చూస్తున్న సీతక్కయ్యను చూడగానే అప్పటిదాకా అదిమిపెట్టుకున్న ఏడుపు తన్నుకొచ్చింది.

చప్పున వెళ్ళి తనను కావిలించుకుని భోరుమన్నాను.

శిలావిగ్రహంలా కదలిక లేకుండా వుండిపోయిందేకాని అనునయంగా నన్ను దగ్గరకు పొదువుకోలేదు. తోడుగా తనూ ఏడవలేదు.

స్పృహలోనే వుంది గనుక మా అందరి మధ్య జరిగిన వాగ్వాదం తన చెవుల పడేవుంటుంది. ఎంత నిర్లిప్తంగా వుంది.

ఘోషించే సముద్రం లాంటి ఆ హృదయంలో ఎంత వేదనాగ్ని వుందో, అది తనను ఎంతగా దహిస్తోందో ఎవరికి తెలుస్తుంది?

మమకారం, మమత మర్చిపోయిన దానిలా.... శూన్యం తప్ప మరేం గోచరించనట్టు గాజుబుర్రు లాంటి కళ్ళతో....

ఇన్నాళ్ళూ అనుభవించన ఒక అందమైన ప్రపంచంలోంచి, ఒక్కసారిగా భయంకరమైన శూన్యంలోకి విధి విసిరేస్తే....

నిర్మలంగా, ప్రశాంతంగా వున్న నీలాకాశం క్షణాలమీద కారుమబ్బులు అలుముకుని, అప్పటిదాకా హాయిని కలిగించిన మలయమారుతం కాస్తా ప్రళయకాల ప్రభంజనమై చుట్టుముట్టేస్తే దిక్కు తోచని స్థితిలో యిలా శిలగా మారిపోవడం సంభవమేనా.

పలకరించాలి. కఠినశిలగా మారిన ఆ హృదయన్ని ద్రవీభూతం చేయాలి. లేకుంటే ఆ కాఠిన్యం అలాగే కరుడుగట్టుకుపోయి ఆ గుండె స్తంభించిపోతే.... ఆ వూహే భయకరంగా సాగి....

"అక్కయ్యా.... యీ అన్యాయం విన్నావు కదూ. ." తన కళ్ళల్లోకి చూస్తూ అన్నాను. అక్కయ్యేం మాట్లాడలేదు.

"నీవు యీ ఘోరానికి ఒప్పుకోకు. ప్రతిఘటించు. నీకు నేను అండగా వుంటాను." కళ్ళుతిప్పి చూసింది. భావ శూన్యమయిన చూపులు.

"నీవిలా వుండిపోతే వాళ్ళు ఎంతెంత ఘోరం తలపెడుతున్నారు? అంతా చేస్తారు" ఆవేశంగా అన్నాను.

"భగవంతుడు విధించిన శిక్షకన్నానా కారదా...."

అక్కయ్యా ఏంతోసేపటి తర్వాత మాట్లాడిన ఆ ఒక్కమాటలోనూ ఎంతో వేదన ప్రస్ఫుటమయింది.

"అవును ఒక విధంగా అంతకన్నా ఎక్కువే. ప్రజ్వలించిపోతున్న అంతరంగాన్ని నవనీతం లాంటి మాటలతో, చేతలతో చల్లబరచవలసింది పోయి

అచారాల పేరిట, ఆ అగ్నిలో మరింత అజ్యం పోయటం దారుణం కాదూ."

నా మాటలు తనలో ఆలోచనను రేకెత్తించాయో, లేక ఇప్పటికి ఆచారం పేర జరిగే దారుణం యిదీ అని అవగాహన అయిందో తెలీదు గానీ హఠాత్తుగా నన్ను పెనవేసుకుని నా గుండెలో తల దాచుకుంది. మహాసముద్రాలు పొంగాయి. వుప్పెనే వచ్చేసింది. యీ ప్రవాహాలకు ఆనకట్టలు వేయటం ఎవరికి సాధ్యం?

"ఏమిటమ్మా యిదీ" అంటూ తనూ ముంచుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తూ అక్కయ్య వాళ్ళ అమ్మ వచ్చింది.

"వూరుకో తల్లీ వూరుకో. ఆ పాపిష్టి భగవంతుడికి మిమ్మల్ని చూసి కళ్ళు కుట్టాయి. మీరంతా పచ్చగా వుండగానే మా జీవితాలు వెళ్ళమారిపోవాలనుకున్న యీ ముసలి ప్రాణాలు ఆయన దృష్టిలో పడలేదు. యీ శోకాన్ని అనుభవించటానికే మేమింకా బతికివున్నాం. చూడమ్మా వారంరోజులకే ఎలా అయిపోయావో. ఆ పసిదానికోసమైనా నీవు నిబ్బరం తెచ్చుకోవాలి. గుండె దిటవు చేసుకోవాలి. నీ విట్లా ఏడిస్తే ఆ పిల్ల ముంద బెదిరిపోతుంది దిగమింగుకోవాలమ్మా దుఃఖం. యిప్పుడే యిట్లా వున్నావు రేపెట్లా భరిస్తావు సీతా......"

అప్పటిదాకా వెక్కుతూ వెక్కుతూ ధైర్యంచెప్పిన ఆవిడ ఆ చివరి వాక్యంతో భోరున ఏడ్చేసింది.

సరిగ్గా ఆ చివరి వాక్యంతోనే అప్పటిదాకా ఆవిడ మాటలకు సుళ్ళుతిరుగుతున్న దుఃఖం ప్రక్కకు తప్పుకుని ఆ స్థానానే ఆపుకోలేని కోపం చోటు చేసుకుంది.

"భగవంతుడు కళ్ళు కుట్టి అక్కయ్యకు ద్రోహంచేశాడు. వాడు పాపిష్టివాడు. మరి....మరి....మనం ఏం కుట్టి యింకా దాన్ని చిత్రవధ చేయాలనుకుంటున్నట్టు. మన మింకా ఆత్మీయులం కూడా" అన్నాను కసిగా.

చూడమ్మా నీవు యీ తరందానివి. పైగా చాల తెలివైనదానివి. మేము పాత కాలం వాళ్ళం. ఇది మా పిల్ల. మీ మాటలకు పోయి మూఢాచారాలు అంటూ పీటని కొట్టిపారేసి యింకా అరిష్టాలు జరగటానికి మేము సిద్ధపడలేము. మాకా ధైర్యంలేదు కూడా .... ...." యింకా ఏదో అనబోయిందావిడ నాకు కాస్త చిన్నతనం తోచింది. వెనకాడాలనిలేదు.

"అంటే....రేపు జరపాల్సిన తతంగం జరపకపోతే యింకా ఏదో యిలాంటివి జరుగుతాయని మీ నమ్మకం, అవునా" రెట్టించినట్టుగా అడిగాను.

"అవును" నిశ్చయంగా అందావిడ.

"దీనికే మా గుండెలు పగిలిపోతున్నాయి. యింకా ఏదన్నా జరిగితే మాకు భరించే శక్తిలేదు.... యివన్నీ

పిల్లాటలు కావు తెలుసా" కొస్త కోపం తొంగి చూపిందావిడస్వరంలో.

'వీళ్ళతో వాదించి లాభంలేదు' తెలిసిపోయింది నాకు. మౌనంగా వుండి పోయాను. ఆ రాత్రి....అందరూ పడుకున్నాక నెమ్మదిగా సీతక్కయ్య పక్కకు చేరాను. తను పడుకున్న మంచం ప్రక్కనే వున్న ఖాళీమంచం కేసి చూస్తోంది. అది బావగారిది. ఎన్ని అనుభూతులను పెనవేసుకుందో ఎన్ని అనుభవాలను పంచుకుందో నెమరు వేసుకుంటోందేమో. నిద్ర పడుతుందా...

సన్నని దీపకాంతిలో ముఖంలోకి చూస్తూ వుండిపోయాను కొన్ని క్షణాలు. మీద చేయివేశాడు. తను వర్షించబోయే మేఘంలా వుందని ఏ చిన్న తాకిడికైనా కరిగి, వర్షించి వెల్లువలా ప్రవహిస్తుందని అర్థమవటానికి ఎంతోసేపు పట్టలేదు.

దుఃఖభారమంతా తీరిపోయాక, నా గుండెల్లో వొదిగిపోయిన ముఖాన్ని పైకెత్తి "శారదా .. రేపు....రేపు.... నేను భరించలేను. నా గుండె పగిలింది. యింకా రగులుతోంది. నేనేదో అపరాధం చేసినట్టు నాకు విధించే ఆ శిక్షని నేను.... నేను తట్టుకోలేను. దీన్ని.... దీన్ని ఆపు చేయవూ.... ఆపుచెయ్యవూ...."

పెనుగాలికి కంపించిపోతున్న చిగురుటాకులా వణుకుతూ అంది.

ఒక్కసారిగా కొత్త శక్తి నాలో ప్రవేశించినట్టయింది.

సీతక్కయ్య భుజంచుట్టూ చేతులు వేశాను.... అంత బాధలోనూ తన మాటలకు సంతోషమైంది నాకు.

"అక్కయ్యా.... అక్కయ్యా.... నీ వామాట మీదే వుంటావా. నా మాటలు వీళ్ళు లెక్కచేయటంలేదు. నీ వొక్కదానివి ధైర్యం కోల్పోకుండా యీమాట మీదే వుంటే యింకా అంతమందితో నయినా నేను యీ విషయంగా పోరాడుతాను. అర్థంపర్థం లేని ఆచారాలవి ఎదుటివాళ్ళ తలమీద రుద్దటానికీ, శాసించటానికీ వీళ్ళెవరు ? ఈ దిక్కుమాలిన ఆచారాలు ఎంత హింసపెడతాయో తెలిసీకూడా వీళ్ళు సన్నద్ధులవుతున్నారంటే అది రాక్షసత్వపు ఛాయ కాదూ...." నాలో ఆవేశం వుప్పొంగుతోంది ఒక విధమైన ధైర్యంతో.

"కాని...." అక్కయ్య ఒక్కసారి కళ్ళెత్తి చూసి తల వాల్చేసింది.

"ఇదిగో యిలా బేలవయిపోకు. యిందాకటి మాటమీదే వుండు. వాళ్ళేమయినా అంటారనే కదూ. ఒక రంటారని, మరొకరు అనుకుంటారని యీ చాదస్తపు బూజు మాటలకి లొంగిపోతే యిక అంతే...అక్కయ్యా ఒక్కమాట. నామీద నీకు గురివుంది కదూ. నేను బాగా ఆలోచించి మాట్లాడుతానని, దూరం యోచించి సరైన నిర్ణయాలు తీసుకుంటానని బావగారికి కూడా నామీద

ఎంతో నమ్మకం వుండేది. నీతో అనే వుంటారు కూడా. చూడు. మనల్ని అంటే మన స్త్రీజాతిని మనమే వెలుగులోకి తెచ్చుకోవాలి. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని, మనల్ని హింసిస్తున్న యీ మూఢాచారాలనే వంత్రాళ్ళను కత్తులతో పరపరా కోసి మనల్ని వుద్ధరిస్తారని అనుకోటం అవివేకం. ఎవరూ రారు. మనకి మనమే ధైర్యం తెచ్చుకోవాలి. గుండె నిబ్బరంతో ఎదుర్కోవాలి. పోరాడాలి. మనల్ని మనమే వుద్ధరించుకోవాలి. నీలో ఆ ధైర్యముందని చెప్పు. నేను నీకు తోడు, అండ. నీవు జావకారిపోతే వాడి కంఠశోషగా మాత్రమే మిగిలిపోతుంది. రేపు ఎందరు ఏమన్నాసరే నీవు వ్యతిరేకించి నిలబడగలవా?" ఆవేశం తెస్తున్న ఆయాసంతో కొన్ని క్షణాలు ఆగాను. ఆగిన ఆ కొన్ని క్షణాలలోనూ నా మాటలు తనమీద ప్రభావాన్ని చూపుతున్నాయా లేదా అని గమనించాను.

ఆ ముఖంలో నాకే భావం అగపడలేదు.

మీద చెయ్యివేసి దగ్గరగా పొదువుకున్నాను.

"అక్కయ్యా యీ కారణంగా వీళ్ళందరూ నిన్ను దూరంచేస్తారనో, చేరనివ్వరనో భయపడబోకు. నీకు నే నున్నాను. కొన్నాళ్ళు పోతే వాళ్ళే సర్దుకుంటారు. అలా సర్దుకోలేని పక్షంలో ఆ ఆత్మీయత మన కవసరం లేదు." అన్నాను ధృడంగా.

"శారదా...." అంది ఆర్ద్రంగా అక్కయ్య.

"అవును అక్కయ్యా! నే నేదో రచనలు చేసేటప్పటి ఆవేశంలో అనటం లేదు. నేను కావాలనుకుంటున్న మార్పు, రావాలనుకుంటున్న చైతన్యం కేవలం నా రచనలకే పరిమితం కాకుండా నా చేతలద్వారా చేయగలిగే అవకాశం నాకు కలిగింది. కాకుంటె యిప్పుడు నీవు ధైర్యంగా మొండిగా నిలబడాలి. వాళ్ళు కానీ, నేను కానీ నీ సహకారం లేకుండా నిన్నేమీ చేయలేము. మరి ఆ దారుణం భరించలేననుకుని నీవు నిలబడగలవు కదా?"

చాలా సేపు మాటాడలేదు అక్కయ్య. నాలో నాకే తెలీని ఆరాటం.

తీవ్రమయిన సంఘర్షణలోనే మగత వస్తోంది నాకు. ఆ మగతలోనే వినిపించింది అక్కయ్య కంఠం నెమ్మదిగా. "శారదా నీ మాటే నాదీనూ."

ఆ రాత్రి తెల్లవారింది.

ఆ వుదయం వాగ్యుద్ధంతో మొదలయింది. చిన్నాపెద్దా అందరూ కలిసి నన్ను ఛీత్కారంగా విదిలించిపారేసి అక్కయ్యను చేరుకున్నారు.

తనకు ఏవేవో చెబుతున్నారు. ఆచారాల గురించి, ఈ సమయంలో తెచ్చుకోవలసిన ధైర్యం గురించి, ముక్కలు

ఎగబిలుస్తూ తనను లేపడానికి సిద్ధమయ్యారు.

ఒక్క అంగలో నేను అక్కయ్యను చేరుకున్నాను. తన మౌనం నన్ను భయపెట్టింది.

"పీల్లేదు మీరు చెబుతున్న తతంగం జరగటానికి వీలు లేదు........

"చూడమ్మా మీకు, నీ సంస్కారాభిలాషకు వేయి దండాలు. అడ్డురాకు...."

"బావగారూ...." విహ్వలంగా చూశాను....

"ఆయనంటున్నది నిజమే. ఆదర్శాల పేరుతో అరిష్టాలు కొనితెచ్చుకోకండి" అక్కయ్య తండ్రి అన్నారు. అక్కయ్య సోదరుల ముఖాల్లో కూడా నామీద అసహనం కనిపిస్తోంది.

"శాదస్త్రాల పేరిట మీరూ గాయపడిన హృదయాలని మరింత చిత్రవధ చేయొద్దని...." నా మాట పూర్తికానేలేదు.

"సీత మా బిడ్డ. దానిమీద మాకు సర్వాధికారాలున్నాయి. నీదేమిటి పెద్ద. నీకు ఆదర్శాలుంటే నీ వాచరించుకో.... నీవే పట్టుకు వ్రేలాడు".... అక్కయ్య వాళ్ళ నాన్న తీవ్రంగా అన్నాడు.

అవాక్కయి పోయాను కొన్ని క్షణాలు. నా నిస్సహాయతకి, వీళ్ళ యీసడింపులకి నా గుండెలు మండుతున్నాయి. కళ్ళలో నీళ్ళూరుతున్నాయి.

అక్కయ్య తలవంచుకుని మౌనంగా కూర్చుని వుంది. నోట్లోంచి ఒక మాటా లేదు. ముఖాన ఒక భావమూ లేదు. తనలో ధైర్యం దిగజారిపోయిందేమో. వీళ్ల మాటలకు తను తలూపి బలిపశువులా బయలుదేరటానికి ఎంతోసేపో పట్టేట్టు లేదు. ధైర్యం తెచ్చుకున్నాను.


"సీత మీ బిడ్డే. కాదనం. కాని ఒకప్పుడు. యిప్పుడు మా యింటి కోడలు. ఆ అధికారాలు మాకు తప్ప మీకుండవు. అయినా యిది తన వ్యక్తిత్వానికి సంబంధించింది గనుక నిర్బంధించటానికి మాకూ అధికారం లేదు. తన అంగీకారం వుండాలి...." మెరమెరలాడుతున్న ఆశతో మధ్య మధ్య అక్కయ్యకేసి చూస్తూ అన్నాను. ఏ మూలో సన్నగా భయం.

అక్కయ్య ఏం మాటాడలేదు.... వాళ్ళమ్మకి నామీద కోపం వచ్చింది. కూతురి మౌనానికి కోపం వచ్చింది. అది ఆవేశంగా మారింది.

"నీ మాటలకు, వుపన్యాసాలకు గంగిరెద్దులా తల వూపిదంటే.... వున్న ఆశ ఆ ఒక్క పసికందు కూడా రేపోమాపో తాప్పున చచ్చి...."

"పిన్నిగారూ..."వుద్రేకంగా అరిచాను.

"ఆశీర్వదించవలసిన నోటితో అమంగళాలు పలకకండి. మీ యిష్టం వచ్చినట్టు చేసుకోండి...." ఆవేశం, ఆక్రోశం, ఆగ్రహం అన్నీ కలిసి దుఃఖంగా మారి నన్ను ముంచేస్తున్నట్టు




గ్రహించి చరచర లేచి అవతలకు వెళ్ళిపోయాను.

“లే సీతా! పొద్దెక్కుతుంది....” బొంగురుగా పూడుకుపోతున్న అక్కయ్యవాళ్ళ అమ్మ కంఠం వినబడింది. కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

అక్కయ్య లేచిందా...ఏడుస్తుందా... బయలుదేరిందా వ్యర్థ శంకలు.... నా హృదయంలో ఆరాటం.... అయినా కదలలేకపోయాను. నా నిస్సహాయత నా కాళ్ళకు సంకెలలు వేసినట్టుంది.

“లేమ్మా.... సీతా.... గుండె దిటవు చేసుకో. రాకూడని కష్టంవచ్చింది నీకు. యీ ఘోరాలు చూడటానికే మేమింకా బ్రతికి వున్నాం.... వాళ్ళ నాన్న ముక్కు చీదటం వినిపించింది.

ఊపిరి బిగబట్టి చెవులు అప్పగించాను నేను. నేను తప్ప యింట్లోని ఆడవాళ్ళందరూ, కొందరు మగవాళ్ళూ చుట్టూ చేరివున్నారని తెలుసు నాకు. తను పంచంమించి దిగటమే ఆలశ్యం గొల్లున ఏడుపులు వినవస్తాయనీ తెలుసు.

కాని.... నిశ్శబ్దం....

క్షణాల నిశ్శబ్దమయినా ఒక్కోసారి భరించలేకపోవటం విడ్డూరం.

“సీతా.... లేవాలి.... లే........” మా పెద్ద తోటికోడలి గొంతు. అనకూడదు కానీ వీళ్ళకు కూడా యిలాంటి స్థితి వస్తేతప్ప ఆ బాధ అర్థంకాదేమో ....నాలో కసి రేగుతోంది....

“అలా కూర్చుండిపోతే ఎలా....” వాళ్ళ నాన్న కంఠంలో విసుగు. బహుశా

కళ్ళొత్తి నీళ్ళునిండిన కళ్ళతో వాళ్ళ నాన్న కేసి చూసివుంటుం దక్కయ్య.

"శారదమాటే నా మాట. దయచేసి నన్ను వేధించకుండా వెళ్ళండి."

అది అక్కయ్య గొంతేనా.... సీత క్కయ్య గొంతే.... ఎంత నిక్కచ్చిగా ....ధైర్యంగా చెప్పేసింది...."

అంత దుఃఖంలోనూ పెల్లుబికిన ఆనందోత్సాహలతో ఒక్క పరుగున అక్కయ్యను చేరుకుని నా చేతులతో చుట్టేసి....

ఆ తరువాత ఒకొక్కక్కరుగానూ... కటికికట్టుగాను ఆత్మీయులు విసిరిన వాక్బాణాలు మాకు గుచ్చుకోనేలేదు.... బాధపెట్టనే లేదు. వాళ్ళ ఆక్రోశం అంతా మాటల్లోనే తీర్చుకోవటంతో తామేం మాట్లాడుతున్నారో తెలీకుండా విరుచుక పడ్డారు.

"ఏం అనాచారం వూరికే పోదు. కొడు తుంది వంశానికే.... పెద్దలు చెప్పితే అంత నిర్లక్ష్యమా ... మొగుడు పోయాక యింకా అన్నీ కావాలనుకోడం...." అక్కయ్య వాళ్ళ అమ్మ ఏడుస్తూ.... శాపనార్థాలు పెడుతూ.... ఒకొక్కక్క రుగా ఆ గదివిడిచి బయటకు వెళ్ళారు. కొందరిలో ఎలాగయినా జరిపించాలన్న పట్టుదల.... కొందరిలో యింకేం జరుగు తుందోననే భయం, యింకొందరిలో మంచి సీన్ ఏదో మిస్సయిపోయామన్న నిరుత్సాహం ... యివన్నీ కనబడ్డాయి.

వాళ్ళలో వాళ్ళు తర్జన భర్జనలు చేస్తున్నారు.

గది తలుపు మూశాను. దాంతో అప్పటిదాకా నిండివున్న చెరువులకు గండి పడింది. ఆ ప్రవాహాన్ని అపదలుచు కోలేదు నేను. ఆ భారం తగ్గాలి. అప్పుడే మనిషి. తరువాత ఆలోచన చేయగలడు.

నా ఒళ్లో చేర్చుకున్నాను అక్కయ్యను.

ఎంతో సేపటికి.... ఆ దుఃఖ భార మంతా దిగిపోయాక.... నెమ్మదిగా లేచి కూర్చుంది అక్కయ్య.

మెడలోంచి మంగళసూత్రాల గొలుసు తీసింది.

ఆపాలని ప్రయత్నించబోయి మూగ దానిలా కళ్ళప్పగించి చూస్తూండి పోయాను.

కాలివేళ్ళకున్న మెట్టెలు తీసి.... దోసిట్లో పెట్టుకుని ... కొన్ని క్షణాలు తదేకంగా వాటికేసి చూసి.... నిశ్శబ్దంగా రాలిన కన్నీళ్ళతో వాటిని అభిషేకించి.... ఒక్క గుప్పిట్లోకి మూసుకుని మరో చేత్తో, అరచేతితో నుదిటిమీదికి....

చప్పున స్పృహ కలిగినట్లయి ఆ చేతిని గట్టిగా పట్టుకున్నాను.

'తుడవకు' అన్నాను. మాటలు పెదవి దాటి రాలేకపోయాయి. కాని కళ్ళు చెప్పాయి భావాన్ని. కళ్ళను, చేతిని కిందికి దించేసి అక్కయ్య తన గుప్పి ట్లోని వస్తువుల్ని నా చేతుల్లో పెట్టింది.



"అమ్మకిచ్చేయి వీటిని తీసికెళ్ళి" గుండెని చీల్చుకుని వచ్చినట్టుందా మాట.

ఈ విధంగా సీతక్కయ్య తన వాళ్ళకు దూరమైంది. మా వాళ్ళకు భయం గొల్పింది. ఎవరు చేరదీస్తే ఎవరికేం అరిష్టం ప్రాప్తించి కొంపలు మునుగుతాయేమోనన్న భయం. అక్కయ్య నాతోనే వుంటుందని, ఎవరూ భయమూ, ఆందోళనా చెందనవసరం లేదని తెగేసి చెప్పాను.

అందరితో కలిసి నన్ను నిందించక పోగా, నన్ను వారించనయినా వారించకుండా తన మౌనంతో సగం ధైర్యాన్ని, శక్తిని యిచ్చాడు మౌళి. ఆయన సహకారం లేకుండా నేను నెగ్గుకు రాగలనా? ఏమో.... మౌళి విశాల హృదయానికి మనసులోనే జోహార్లు అర్పించాను. చివరగా అందరూ వెళ్ళిపోతున్నపుడు మామగారు నా దగ్గరికి వచ్చి కళ్ళనిండా నీళ్ళు పెట్టు

తుని.... "శారదా! నీ ధైర్యానికి నేను అభినందిస్తున్నాను. నేను పాత తరం వాడిని గనుక బయటికి అనకూడదు కానీ యీ మార్పు నాకు సంతోషంగా వుంది. సీత, బిడ్డ భవిష్యత్తు నీవు తీర్చిదిద్ద గలవు. నీకే సహాయం కావల్సినా నాకు వ్రాయి" అంటూ... అక్కయ్య కూతుర్ని ఎత్తుకుని ముద్దులాడి.... భారంగా కృంగిపోయి... వంగిపోయి.. సర్వశక్తులు... కోల్పోయినవారిలా.... బహుశా ఎప్పుడూ కూడా వచ్చి స్టేషన్‌లో రైలెక్కించే కొడుకుని.... చెట్టంత కొడుకుని.... 'యిక నీవు రాలేవు కదూ నాయనా నాకు తోడు...' అని తల్చుకుంటూ వుండొచ్చు బహుశా.... అలా వెళ్ళిపోతున్న మామగారిని కన్నీటి తెరలమధ్య కనబడినంతవరకు చూస్తూ చేతులు జోడించాను నేను.

* * *

కడివెడు సంతోషం గానీ...కొండంత దుఃఖం గానీ ఆ క్షణానికి, లేదా కొన్ని రోజులవరకు మనిషి మనసుమీద ప్రభావం చూపి అతని కార్యక్రమాల్లో మార్పులు తేగలవు కానీ వరవడిగా సాగే కాలగమనానికి వశమైపోయి, మామూలు స్థితికి వచ్చేసి ఆకాశానికి ఎదిగిపోయిన లేదా పాతాళానికి కృంగిపోయిన మనిషి మామూలు పరిధిలోకి రావటానికి ఎన్నాళ్లో పట్టదు.

గోలుగోలున రోదించే గగనం తన భారాన్ని దించేసుకుని తేలికైపోతుంది. కుంభవృష్టిగా కురిసిన వాన జోరుతగ్గి జల్లుగా మారి ఆగిపోయింది. కళ్ళ ముందు జరిగిన సంఘటనలన్నీ కాల యవనిక మాటున స్పష్టాస్పష్టంగా మరుగైపోయి మనం కావాలనుకుని స్మృతులపొరలు తొలగించిచూస్తే తప్ప కనబడని దట్టమైన తెరలమాటున కప్పబడి పోతాయి.

ఆర్నెల్లకు కొద్దిగా, సంవత్సరం తిరిగేసరికి పూర్తిగా కోలుకుంది సీతక్కయ్య.

దైన్యం గూడుకట్టుకున్న గుండెల్లో దిటవు ఏర్పడింది. నలుగురిలోకి రావటానికిగాని, ఎవరైనా యింటికి వచ్చినపుడు వాళ్ళ ఎదుటపడటానికి గాని జంకేది అక్కయ్య. యిప్పుడు కాస్త ధైర్యం వచ్చింది.

విమర్శలు ఎడాపెడా యిద్దర్నీ తాకుతున్నా మొండిగా సమాధానం చెప్పే స్థితికి వచ్చింది తానూ.

విమర్శలకు కారణం బొట్టూ, గాజులూ, పూలూ....

వాటిని మాత్రం తీసేయకు అని నేనే చెప్పాను. మొదట్లో తప్పుచేసినట్టుగా బాధపడినా రాను రాను నిబ్బరం తెచ్చుకుంది.

మాశి ఎదుటపడాలన్నా.... తనతో మాట్లాడాలన్నా జంకేది. "ఏదో అపరాధం చేశామన్న భావన మనసులోంచి

తుడుచుకపోతే తప్ప నీవు బాగుపడవు" అంటూ నేనే ధైర్యం చెప్పాను. మౌళికీ చెప్పాను అలా అంటీముట్టనట్టు కాకుండా అపరిచితురాలిలా చూడకుండా మీ వదినగా ఆత్మీయత చూపించండి అని. తనలో ధైర్యాన్ని పెంచండి అని.

నేను వూహించినదానికన్న తొందరగా సీతక్కయ్య కోలుకుంది. మనుషుల్లో పడింది. అందుకు నాతోపాటు మౌళీ ఎంతగానో సహకరించారు. పాప తండ్రిని మరచిపోయింది.

అక్కయ్యను కుట్టు సెంటరులో చేర్చాను. తనకు ఏదో వ్యాపకం వుండాలి. గతాన్ని నెమరువేసుకుందుకు కూడా వ్యవధిలేనంతగా నిమగ్నమై పోగలిగితే ఆ జ్ఞాపకాల రంపపుకోత నుండి త్వరగా బయటపడుతుంది.

మొదట్లో తనని ఒంటరిగా వదిలేసి మా గదిలోకివచ్చి పడుకోవాలంటే నాకు సాధ్యంకాలేదు తన ఆలోచనలు తిరిగి తమ దాంపత్య జీవితంలోకి ప్రవేశించి... ఆ స్మృతుల లతల్లో చిక్కుకుని వుక్కిరి బిక్కిరి అవుతే....

చాలా రోజులు అక్కయ్యకు తోడుగా పడుకుండిపోయాను.

చివరకు ఒకరోజు అక్కయ్యే తను పడుకోగలనని వెళ్ళమని అంది.

యిలా జరిగిపోతున్న రోజుల్లో.... ఓ వేసవికాలం సాయంత్రం....

• • •

'వంశవృక్షం' సినిమా కెళ్ళాం.

అక్కయ్య రానంది. ఆ సినిమాకి తనని తీసుకెళ్ళటం నాకూ యిష్టంలేక పోయింది.

సినిమా నుండి తిరిగివస్తూ నాకూ మౌళికీ మధ్య జరిగిన సంభాషణ.... గతంలోంచి వర్తమానంలోకి వచ్చాను. ఆ సంభాషణే నన్నంత వెనక్కి తీసుకెళ్ళింది. యిప్పుడా సంభాషణే నన్ను ముందుకు ఆలోచింపచేస్తోంది.

"అయితే యింకేం. మీ అక్కయ్యకి పెళ్ళిచేసెయ్యి."

మౌళి అన్న మాటలు ప్రతిధ్వనులై నా మెదడుని, మనసుని తొలిచేయసాగాయి.

'అవును మౌళి ఎంత బాగా చెప్పాడు' నా కెందుకో ఆ ఆలోచన రావటమే భయంగా అనిపించింది.

అక్కయ్యతో ఎలా అడగటం? 'నీవు మళ్ళీ పెళ్ళిచేసుకో', అని చెప్పటం ఎలా బాధపడుతుందేమో.... నాకు బరువుగా వున్నట్టు తలుస్తుందేమో.. అక్కయ్యని ఎలాగేనా ఒప్పించాలి. ఏమంత వయసుందని. నాకన్నా రెండో మూడో ఏళ్ళు పెద్దది. మౌళికన్నా ఓ ఏడు చిన్నదే. ఏన్నాళ్ళా మాధుర్యంలేని బ్రతుకు మోస్తుంది. ముప్ఫయి ఏళ్ళయినా నిండని యీ జీవితం ఎప్పుడు ముగుస్తుందని... నిర్దయం సంతృప్తి

కలిగించేసరికి, కందిరీగల్లా చుట్టుముట్టిన ఆలోచనలు ఒక క్రమంలోకి వచ్చేసరికి విద్ర ముంచుకొచ్చింది.

* * *

ఆఫీసుకు బయలుదేరటానికి తయారవుతున్న మౌళితో "మాట్లాడాలని వచ్చాను," అన్నాను దగ్గరగా వచ్చి.

"ఏమిటో?...." నావేపు తిరక్కుండా అద్దంలో చూసుకుంటూ అన్నాడు.

"అదే ... అక్కయ్య గురించి.... రాత్రి మీరు వ్యంగ్యంగానే అన్నారని అర్థమయింది నాకు. కానీ మీ మాట నాలో సరైన ఆలోచననే రేకెత్తించింది. నేను అక్కయ్యని ఒప్పించగలను. మీరు.... తనని పెళ్ళిచేసుకోగల విశాల హృదయుడు ఎవరైనా ఉంటే కాస్త చూడాలి" అంటూనే అన్నాను.

ఇది చిన్న విషయం కాదు. దీంతో మరో యుద్ధం జరగనూవచ్చు.

కోపంగా ఏదో అంటారనుకుని ఎదురుచూస్తున్న నేను, తల వంచుకుని నేంచూపులు చూస్తున్న నేను ఆశ్చర్యంగా తలెత్తిచూశాను.

మౌళి నన్నే తదేకంగా చూస్తున్నాడు. నాలో ఏ మూలో సన్నసన్నగా వున్న ధైర్యం పుంజుకొని విస్తరించింది.

"ఇప్పుడు కాలం మారింది. మనుషుల దృక్పథాలలోనూ మార్పులు వచ్చాయి. సంస్కారవంతుడు అయిన మగవాడు మీ స్నేహితులలోనో.... పరిచితులలోనో వుండకపోరు. మీరు...."

"యింక చాలు. వేసుకి పెత్తనమిస్తే ... అన్నట్టు తయారవకు. ఆదర్శం అన్నావు. వుద్ధరింపు అన్నావు. అయిన వాళ్ళకందరికీ ఆవిడని దూరం చేశావు. దాంతో వచ్చిన పెద్ద ప్రమాదమేమీ లేదుగనుక, పైగా ఆవిడ వున్నస్థితి చూశాకా నీకు అడ్డుచెప్పలేదు నేను. అలా అని నీవు మా పరువుప్రతిష్టలకే ఎసరుపెట్టే పనులు చేస్తే మాత్రం...." ఆగారు.

"చేస్తేమాత్రం .... ...." అడిగాను,

"బావుండదు యింకోసారి యీ ప్రసంగం తీసుకురాకు." చరచరా వెళ్ళిపోయారు మౌళి.

నాకు కోపం రాలేదు. యిలాంటివి ఒక్కసారిగా బుర్రకెక్కవు. మన రక్తంలో పాతుకుపోయిన ఆచారాలు అంత త్వరగా వదలవు.

అసలు అక్కయ్య మళ్ళీ పెళ్ళికి, మరో మగవాడి సాహచర్యానికి అంగీకరిస్తుందా. ఎలా తనని అడగటం? తొందర పడకూడదని, మౌళి సాయంలేకుండా చేయలేను గనుక అతన్ని నెమ్మదిగా దారిలోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నాను.

నాలో కలిగిన ఆలోచనను, నిర్ణయాన్ని అతనిలో ప్రవేశపెట్టాను. నిదానంగా సమయం చూసి అతడ్ని మళ్ళీ

కదిలించాలి. కొన్ని రోజులు గడవనీ అనుకున్నాను

* * *

హఠాత్తుగా మెలకువ వచ్చింది. నిద్ర కళ్ళకు అంతా చీకటిలాగే కనిపిస్తోంది. జీరోవాట్ బల్బు చీకటిని పారద్రోల లేక నిస్పృహగా వెలుగుతోంది. మాళి మంచం ఖాళీగావుంది 'బాత్ రూమ్‌కి వెళ్ళి వుంటారు.'

ఒత్తిగిల్లి పడుకోబోయి.... చప్పున లేచి కూర్చున్నాను.

సన్నని రోదన ధ్వని.... ఏవో మాటలు.... అస్పష్టంగా....

ఒట్టి రోదనే అయితే అక్కయ్య గతాన్ని తలచుకుంటూ భరించలేని బాధను వెళ్ళగక్కుతుంటుందని అనుకునేదాన్ని. కాని మాటలు.... ఎవరు మాట్లాడుతున్నది........ మాళినా....?

నా వెన్నెముక జలదరించింది. నా వూహకు నన్ను నేనే నిందించుకున్నాను. నన్ను లేపటం యిష్టంలేక తనే ఓదార్చటానికి వెళ్ళివుండకూడదా....

ఎంత సంస్కారమున్న హృదయమైనా ఒక్కొక్క క్షణంలో ఎంత నీచమయిన వూహలకు తావిస్తుందీ నన్ను నిందించుకుంటూ లేచి.... మంచం దిగి.... కళ్ళు నులుముకుంటూ .... అక్కయ్య గదివేపు వెళ్ళాను.

గుమ్మందాకా వెళ్ళకుండానే ...



యింకా కిటికీ దాటుతూండగానే ........ స్థాణువులా నిలబడిపోయాను. ఒంట్లో రక్తం అంతా నీరుగా మారి.... పాదాల్లోకి జారి... నా కళ్ళు.... చెవులు సరిగ్గా పనిచేస్తున్నాయా? వాటి పని అవి సక్రమంగానే నిర్వహిస్తున్నాయని, నేను కలగనటంలేదని నా మెదడు చెబుతోంది. ఆ చూస్తున్న దృశ్యం, వినబడుతున్న మాటలు సత్యమేనని నా గుండెను కోస్తున్న బాధ తెలుపుతూనే వుంది.

సీతక్కయ్య మంచంమీద కూర్చుని మోకాళ్ళచుట్టూ చేతులు పెనవేసుకుని వాటిమధ్య తల పెట్టుకుని ఏడుస్తోంది సన్నగా.

మాళి పక్కనే కూర్చుని అక్కయ్య

వీపుచుట్టూ చేతులువేసి.... మరో చేత్తో అక్కయ్య జుట్టు నిమురుతూ....

"ఎలా.... యిది ఎలా సంభవం.... ఎలా సంభవం...." నా గుండెల్లోంచి వేయికంఠాలు ఎలుగెత్తి ప్రశ్నిస్తున్నాయి నన్నే.... నన్నే....

"చూడు.... ఎందుకలా ఏడుపు. మగవాడి సాహచర్యం లేకుండా ఎన్నాళ్ళని కోరికలని అణగ్గదొక్కుకుంటూ గడుపుతావు. నీకేం భయం అక్కరలేదు. నేను నిన్ను వదలను. శారద అసలే వదలదు...." మౌళి అనునయిస్తున్నాడు. రెచ్చగొడుతున్నాడు. అభయం యిస్తున్నాడు ధైర్యం చెబుతున్నాడు.

"మౌళీ.... ఎంతగా దిగజారిపోయావురా" నా గుండె ఆక్రోశిస్తోంది లోపల్లోపలే. అక్కయ్య అభిప్రాయం ఏమిటో? ఈ ఊహతో నాకు ధైర్యం వచ్చింది. అక్కయ్య నాకు ద్రోహం చేయదేమో, నన్ను అడుగున నా జీవితానికి ఎసరు పెట్టదు. ఈ ఊహ నాకు కొంత ధైర్యం యిచ్చింది. ఆ ధైర్యం, నమ్మకం క్షణాలమీద సడలిపోతుందని అనుకోలేదు.

చప్పున తలెత్తి మౌళి గుండెల్లో ఒదిగిపోయి....

"భగవాన్ ఏం దృశ్యం చూస్తున్నాను నేను.... నా గుండెని తలుపు సందుల్లో పెట్టి నొక్కుతున్నట్లు....

"మౌళీ.. ఏ వింతగా చెబుతున్నావు గానీ నాకు శారద చేసిన సహాయానికి.... తన కెలా నా ముఖం చూపించటం...."

ఒకమాటకు మరోమాటకు పొంతన లేకపోయినా అక్కయ్య మనస్సు అర్థమయిపోయింది నాకు. ఒక్కసారిగా, మొదటిసారిగా అసహ్యం ముంచుకొచ్చింది నాకు తనమీద. చేసే పనికి బాధలేదు కాని నా ముఖం చూడటానికి మాత్రం.... ఛీ.... ఛీ.... ఒక్క వుదుటన లోపలికి వెళ్ళాలనుకున్నాను.... కానీ.... నా వ్యక్తిత్వం.... నా సంస్కారం.... అలాంటి స్థితిలో ఎదురవటం నాకే అవమానం.... తలమీద నిప్పులు కురిసినట్టుగా అనిపించి గిరుక్కున వెనుదిరిగాను. క్షణం ఆగిపోయాను. ఆ ఒక్క క్షణం పగిలిన నా గుండెని మరిన్ని ముక్కలు చేసింది.

"అది ఆదర్శాల పిచ్చిలో పడి కొట్టుకుంటుంది. స్త్రీ జనోద్ధరణకు, సంస్కరణలకు కథలు అల్లుతూ పాటుపడుతోంది. యిందుకే మాత్రం అభ్యంతరం చెప్పదు. నీవు భయపడకు" మౌళి అంటున్నాడు.

యింకేం వినలేకపోయాను. నా హృదయం చిల్లులుపడి, రక్తం స్రవించినట్టు నరకబాధ. నా మంచితనాన్ని, నా ఆదర్శాలని యింత హేళనగా వుపయోగించుకోవాలని చూస్తున్న వాళ్ళ లేకితనానికి అసహ్యం వేసింది.

నేను పొరపాటు చేశానా....

అదర్శాల అడుగుజాడల్లో నా అడుగు ఎక్కడ తప్పటడుగు వేసింది?

నరాలు మెలితిప్పే యీ బాధని, తినేస్తున్న యీ ఆలోచనలని ఎంతో సేపు భరించలేకపోయాను. చేసిన పొరపాటు ఏమిటి చేయవలసిన కర్తవ్యం ఏమిటో యీ సంఘర్షణలో అర్థంకాదు. పగులుతున్న గుండె వేడెక్కి, రగులుతున్న ఆలోచనలు నాలోని సభ్యతను సంస్కారాన్ని చంపేస్తాయనిపించి రెండు నిద్ర మాత్రలు వేసుకుని మంచంమీద ఒరిగిపోయాను. నిద్రమైకం ఆవరిస్తూండగా తెలుస్తోంది నాకు కళ్ళలో మరుగుతున్న లావా ఆవిరై తిరిగి ద్రవించి కళ్ళ వెంట అశ్రువులుగా మారి రాలుతోందని, ఆ వుద్ధృతం వెక్కిళ్ళ రూపంగా కంఠంలోంచి బయటపడుతోందని

* * *

"మౌళీ మిమ్మల్నోమాట అడగాలి"

"చెప్పండి" అడిగాను.

"మీ అక్కయ్యకు పెళ్ళికొడుకుని చూడమనేనా" నవ్వుతూ అన్నాడు మౌళి. ఆ నవ్వు నా గుండెని చీలుస్తోంది. ఆ నటన చీలిన గుండెలని మండిస్తోంది.

"కాదు. అక్కయ్యని పెళ్ళికూతురుగా చేయమని"

"ఏదయితేనేంలే." అదే నవ్వు.

"రెండూ ఒకటే కాదు. పెళ్ళికొడుకుని చూడక్కరలేదు."

"మరి" యీసారి ఆ నవ్వు లేదు.

"ఆదర్శాల పిచ్చిలోపడి కొట్టుకుంటున్నదాన్ని మిమ్మల్ని పెళ్ళికొడుకుని చేయలేనా?" యీ మాట సూటిగా అన్నాను. నా చూపు సూటిగా తాకిందతన్ని.

కంగారుపడ్డట్టయ్యాడు నా మాటతో.

"అంటే నీవు రాత్రి." ప్రశ్నార్థకం చూపులు చూస్తూ అడుగుతున్న మౌళిని చూస్తే నిరసనగా వుంది.

"అవును. నిన్న రాత్రే చూశాను. నా కనుచాటున యింత జరుగుతున్న సంగతి యిన్నాళ్ళూ నే గ్రహించుకోలేకపోవటం నా తెలివితక్కువో, మీ జాగ్రత్తో యీ విషయం అక్కయ్యతో మాట్లాడి ... అవమానించుకోటమే. ఆదర్శాల పిచ్చి, సంస్కారణలకోసం పాటుపడుతున్నానన్నాడుగా. ఇప్పుడూ ఆ పిచ్చిలోనే వున్నాను. అక్కయ్యని ... పెళ్ళిచేసుకోవాలి." నిశ్చయంగా అన్నాను ఒక్క క్షణం నివ్వెరపోయినట్టు కనిపించాడు. మరుక్షణం ఏదో అసహనం

"వెర్రి ముదిరింది రోకలి తలకు చుట్టమన్నాట్ట' అలావుంది ధోరణి. నీకు మతిపోయినా నేనింకా బాగానే వున్నాను. తనని పెళ్ళిచేసుకుంటే ఎంత రూ నవ్వరూ. అసలు మా యింట్లో, మా వూళ్ళో మా అన్నదమ్ముల్లో నా కెంత చిన్నతనం. బంధువుల్లో పరువు పోదూ...

అలగా జనానికయితే అడిగేవాడుండడు గానీ మనలాంటివాళ్ళు

"మనలాంటివాళ్ళు ఏం గొప్పగా చెబుతున్నారండీ. బుద్ధయితే ఆ అలగా జనానికుండే బుద్ధి వుండొచ్చు కాని కాని "

"చాల్లే నోర్మూయ్. "

"ఎందుకండీ నోరు మూసుకోటం. మాశీ! మీ అసభ్యపు చర్యల్ని సమర్థిస్తూ నేను నోరుమూసుకుని వుండలేను. పైకి పెద్దమనుషుల్లా ప్రవర్తిస్తూ తెరమరుగున అవినీతికి పాల్పడటం నేను సహించను. అన్న భార్య వదిన తల్లిలాంటిదని చూడకుండా .... తన బలహీనతను విస్పృహాయతని ఆధారంగా తీసుకుని, మచ్చికచేసి దగ్గర చేరి కోరికలని రెచ్చగొట్టి

"అయితే "

"ఈ చాటుమాటు పనులెందుకు పెళ్ళి చేసుకోమంటున్నాను "

"అయితే యిద్దరు పెళ్ళాలవుతారన్న మాట నాకు " ఆ నవ్వులో వ్యంగ్యమో గర్వమో

"ఒక మగవాడికి ఒకే పెళ్ళాం అనే నీతి నాది." ధృడంగా అన్నాను.

"అంటే " అర్థంకానట్టు చూశారు.

"ఒక మగవాడికి ఒకే పెళ్ళాం అని చెబుతూ అక్కయ్యని చేసుకోమంటున్నానంటే అర్థంకాలేదా..." విసురుగా అన్నాను.

"అంటే నీ నవలల్లోలాగా, సినిమాల్లోలాగా సూట్‌కేస్ పట్టుకుని భారంగా వెళ్ళిపోతావన్నమాట " కనుబొమలు పైకెత్తి విలాసంగా నవ్వుతూ

"సందర్భాలు అలా వచ్చినపుడు అది నవలయినా, సినిమా అయినా, జీవితమయినా ముగింపులు దాదాపు ఒకేరకంగా వుండొచ్చు "

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు. పెళ్ళాన్ని పంపించి, వదిన్ని కట్టుకున్నాడన్న అపవాదు నాకెందుకు "

"పెళ్ళాం వుండగానే వదిన్ని మరిగాడంటే ఫరవాలేదా "

"రచయిత్రి వయితే అయ్యావు గానీ హద్దూపద్దూ లేకుండా నోరుపారేసుకోకు. మనిషి శిక్షింపబడకూడదని కదా అందరితో పోరాడి ఆవిడను అలంకృతంగానే వుంచేశావు. మరి ఆ గొప్పమనస్సుతోనే ఆమె వయస్సుకూ యవ్వనానికి "

"నా గొప్ప మనసును మీ స్వార్థానికి వుపయోగించుకుందామనుకున్నారు అవునా? యింకా బాగా వుపయోగపడాలనే, నా ఆదర్శం యింకా గొప్పగా వుండాలనే "

"యిలా ఉంటే నీ కొచ్చిన నష్టం ఏమిటి? నీ కేలోటూ జరగదుగా "

ప్రాచులా చివ్వున తలెత్తాను. ఆగ్రహం బుసలు కొట్టింది నాలో. దాన్ని అణుచుకుంటూ "మీకు నేనూ ఏ లోటూ రానివ్వకుండా చూచుకుంటాను.

మరో మగవానితో సంబంధం పెట్టుకుంటాను మీ కిష్టమేనా "

"షటప్ అండ్ గెటవుట్" కుర్చీ లోంచి ఒక్క వుదుటన లేచారు.

"మాట మాత్రంగానే మీకు అంత కోపం, అక్కసు వచ్చాయే. మాకూ అట్లా వుంటుందని ఎందుకనుకోరు. ఆడ వాళ్ళమయినా మాకూ మనసుంటుంది మాళీ. మీ అహంకారంతో దాన్ని నేల రాయాలని చూడకండి నేను ఆదర్శ వాదినే కావచ్చు. స్త్రీలు ఉద్ధరింపబడాలనీ, వాళ్ళకు జరిగే అన్యాయాలను ఎదుర్కోవాలని పోరాడే రచయితనే కావచ్చు, అయినా నేనూ సర్వసాధారణమయిన మామూలు ఆడదాన్నే. మరో ఆడదానితో భర్తని భాగం పంచుకోలేను. ఒక్క మెట్టు మామూలు ఆడవాళ్ళకన్నా మనస్తత్వంలో పైనున్నందున మిమ్మల్ని మరో ఆడదానికి ధారపోయ గలుగుతున్నాను. అదయినా ఒక నిస్సహాయురాలయిన విధివంచిత అయిన ఆడదాని కోసమే నన్న తృప్తి నాకు వుంది. చాటుమాటుగా అవినీతిగా గడపటాన్ని నిరోధించానన్న గర్వం వుంది నా వ్యక్తిత్వాన్ని కాపాడుకున్న సంతోషం వుంది "

"పోనీ యిప్పుడు తనతో సంబంధం పెట్టుకోకుండా వదిలేస్తే..." నా నిశ్చయం అయనలో బేలతనం కలిగించినట్టుంది.

"మాళీ: తనెక్కడికి పోతుంది. నన్ను నమ్ముకుని తనవాళ్ళను దూరం చేసుకుని వచ్చింది. కాలి బూడిదయిన భర్తతోపాటు కాలిపోని కోరికలకు లొంగి మీ వలలో పడింది. యిలా జరిగిందని తెలిశాక, కళ్ళారా చూశాక యిప్పుడు మీరు సంబంధం పెట్టుకోను అన్నా నాకా శక్తి లేదు. నిప్పు ని తెలిశాక దాన్ని ఒళ్ళో వుంచుకోలేను. ఆ ధైర్యం నాకు లేదు. పెళ్ళి చేసుకుంటారో, కలిసి బ్రతుకుతారో మీ యిష్టం. కాని నేను మాత్రం కలిసి పంచుకోను. పంచుకుని కలిసి వుండలేను. యీ విషయంలో మాత్రం నేను మామూలు ఆడదాన్ని మాళీ మామూలు ఆడదాన్ని గుడ్ బై."

మాళీ నివ్వెరపోయి చూస్తున్నాడు. నిండిన చెరువులాగ తొణక్కుండా గది లోంచి యివతలకి వచ్చాను. లోపల ఎన్ని వూబిలున్నాయో మాళీకి అర్ధమయి వుంటుందా.

నా గదిలోకివచ్చి మంచంమీద కూల బడిపోయాను. చెరువుకు గండి పడింది.

పొర్లుతోంది ప్రవహిస్తోంది ముంచేస్తోంది

ఆదర్శాలు కత్తులలాంటివనీ వాటి అంచున నిలబడితే జీవితాలే బలి అయిపోవచ్చునని ఆ క్షణంలో అంటే నన్ను శాశ్వతంగా యీ ఇంటికి నేనే దూరం చేసుకుందుకు సన్నద్ధమవుతూ, నావి అనబడే నా వస్తువులన్నీ పెట్టెలో సర్దుకుంటున్న క్షణాన అవి పించంది అంతర్లీనమైన ఆవేదన చుట్టూ స్తబ్ధత అలుముకుంటోంది.